క్లుప్తంగా

రేపు మహా పడిపూజ

కుంటాల: మండలంలోని కల్లూర్ గ్రామంలో ఉన్న వాసవి కళాశాలలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించనున్నట్లు కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీ గురు మంచి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



తనిఖీ చేస్తున్న ఎస్సై లింబాద్రి

ఖానాపూర్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్సై జి.లింబాద్రి అ న్నా రు. శుక్రవారం మండలంలోని తర్లపాడ్-ఖానాపూ ర్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పెండింగ్ చలాన్లు ఎప్పటికప్పుడు చెల్లించాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని ప్రైవేటు వాహనదారులను ఆదేశించారు. ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపేవారు ప్రమాదాల బారిన పడుతున్నారని అవగాహన కల్పించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు



ధర్మోరలో నిప్పు పెట్టిన రైతులు

లోకేశ్వరం: పొలంలోని వరి కొయ్యలకు నిప్పు పెడితే భూమి వెడెక్కి సారం దెబ్బతింటుందనే కనీస అవగాహన చాలా మంది రైతుల్లో కొరవడింది. దీంతో దిగుబడుల కోసం అధిక మోతాదులో యూరియా, డీఏపీలను వినియోగిస్తూ భూమిలోని లవణాలు కోల్పోయేలా చేస్తున్నారు. పొలంలో నాటు వేసేటప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ మండలంలోని కొందరు రైతులు గడ్డితో పాటు వరికొయ్యలకు నిప్పు పెడుతున్నారు. దీంతో భూమిలోని మిత్ర పురుగులు నశించిపోతాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కొయ్యలను కాల్చకుండా పొలంలోనే దున్నేయాలని వారు సూచిస్తున్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై ప్ర జలకు నమ్మకం ఏర్పడిందన్నారు. మతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ కాంగ్రెస్ విజయం కోసం కృషి చేశారని తెలిపారు. భారీ మెజార్టీతో తనను గె లిపించడానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవా దాలు తెలిపారు. సమావేశంలో లింగంపల్లి చంద్ర య్య, బెల్లూరి వామన్‌రావు, ఖయ్యుం, ఎక్బాల్, రా థాబాయి, దూట రాజేశ్వర్, సలీం పాల్గొన్నారు.

తానూరు మండలంలో 88.62 శాతం పోలింగ్

తానూరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో గురువారం 88.62 శాతం పోలింగ్ నమోదైనట్లు శుక్రవారం అధికారులు వెల్లడించారు. మండలంలో 30,745 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 15,229 మహిళలు 5,516 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 13,630 మంది, 13,617 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకోగా మొత్తం 27,247 ఓట్లు పోలయ్యాయి.

దిలావర్‌పూర్‌లో 78.22 శాతం పోలింగ్

దిలావర్‌పూర్: మండలవ్యాప్తంగా 78.22 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలోని 25 పోలింగ్ కేంద్రాల్లో 18,430 మంది ఓటర్లు ఉండగా 15,258 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. దిలావర్‌పూర్‌లోని 287వ బూత్‌లో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. 286వ కేంద్రంలో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం కాగా.. రాత్రి ఏడు గంటల వరకు సాగింది.

లోకేశ్వరం మండలంలో..

లోకేశ్వరం: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ మోతీరాం తెలిపారు. మండలంలోని 38 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 28175 మంది ఓటర్లు ఉండగా 24,145 మంది ఓటును సద్వినియోగం చేసుకున్నారు. 11,269 మంది పురుషులు 12876 మంది మహిళలు ఓటు వేశారన్నారు. నర్సింహనగర్ తండాలోని పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 93.82 శాతం.. లోకేశ్వరంలోని 199వ కేంద్రంలో అత్యల్పంగా 77.05 శాతం పోలింగ్ నమోదైనట్లు పేర్కొన్నారు.

కూలీలకు 'ఉపాధి'

- పల్లెల్లో తగ్గిన వలసలు..
- జిల్లాలో జోరుగా ఉపాధిహామీ పనులు

లోకేశ్వరం: గ్రామాల్లో వలసలు నివారించి ఉన్న ఊరిలోనే పని కల్పించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద పల్లెల్లో పనులను గుర్తించి ఉపాధి కల్పిస్తున్నా రు.

జిల్లాలో వివరాలు..

జిల్లాలో 396 పంచాయతీలుండగా రూ.లక్షా ఏనభై వేల జాబ్‌కార్డులున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు రూ.18.79 కోట్లు చెల్లించారు. జిల్లాలో 3.70 లక్షల మంది కూలీలు పథకంలో రిజిస్టర్ చేసుకోగా.. 2.55 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

2023–24లో రూ.46 కోట్లు కేటాయింపు..

2023–24 ఆర్థిక సంవత్సరంలో పథకంలో భాగంగా జిల్లాకు రూ.46.83 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ.16కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. లేబర్ బడ్జెట్ 59.87 లక్షల పనిదినాలను వరకు కల్పిస్తారు. ఇప్పటివరకు కూలీలకు 43.80 లక్షల పని దినాలు కల్పించారు. ఒక్కోకుటుంబంలో ఏడాదికి సరాసరి 53 రోజుల పని కల్పించారు. జిల్లాలో 12,293 కుటుంబాలకు వంద రోజుల పని కల్పించారు. దివ్యాంగులకు 1,823 రోజులు పని కల్పించారు. పథకం కింద రోజుకు రూ.175 చెల్లించారు. నర్సరీలో పనులు చేసిన వారికి రోజుకు రూ.245 కూలి చెల్లించారు.



రాయపూర్‌కాండ్లీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు (ఫైల్)



ధర్మోరలో ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న కూలీలు



జోహర్‌పూర్‌లో నిర్మించిన వైకుంఠధామం

పథకం కింద చేపట్టిన పనులు..

గ్రామాల్లో వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం, నిర్మించిన రోడ్డు పక్కన మొరం పనులు చేపట్టడం, గుట్ట ప్రాంతంలో నీరు నిల్వ ఉండేలా కందకాల తవ్వకం, చెక్‌డ్యాంల నిర్మాణం, చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు, రైతుల భూమి చదును చేయడం, నర్సరీల్లో మొక్కల పెంపకం, మొక్కలకు నీళ్ల పోయడం, ఇంకుడుగుంతలు, నీటి నిల్వ గుంతల ఏర్పాటు వంటి పనులు పథకం కింద కూలీలతో చేయిస్తున్నారు.

ఉపాధి పనులకు వెళ్తున్నాం



అడిగిన వెంటనే అధికారులు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. మా గ్రామంలో చెరువులో మట్టి తవ్వే పనులు చేశాం. ఉన్న ఊరిలోనే పనులు దొరకడంతో వలసలు తగ్గాయి. పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లడం లేదు. ఈ పథకంతో మా గ్రామానికి మేలు జరుగుతుంది.

– మరియా, రాయపూర్‌కాండ్లీ

కుటుంబాన్ని పోషించుకుంటున్నా



గ్రామానికో నర్సరీ ఏర్పాటు చేయాలనే ఆలోచన మంచిదే. ఇంతకుముందూ మండలంలో ఎక్కడో మొక్కలు పెంచితే తెలిసినోళ్లే పోయి తెచ్చుకునేవారు. ఇప్పుడు గ్రామాల్లో పెంచే నర్సరీల నుంచి అందరూ మొక్కలు తెచ్చుకుంటున్నారు. నేను నర్సరీలోనే కూలీ పనులు చేస్తున్నా. వచ్చే కూలి డబ్బులతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

– రమేశ్, నర్సరీ కూలీ, రాజూర

కూలీలకు పనులు కల్పిస్తున్నాం



ఉపాధిహామీ పథకం కింద అడిగిన కూలీలకు పనులు కల్పిస్తున్నాం. వెంటనే డబ్బులు కూడా చెల్లిస్తున్నాం. గ్రామసభల ద్వారా చర్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ఇప్పటివరకు 86 శాతం పనులు చేపట్టాం.

– విజయలక్ష్మి, డీఆర్‌డీవో

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు మరమ్మతులు చేయరూ..



భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం గ్రామ సమీపంలో భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడు ఏయే ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ప్రశ్నించాల్సిన అధికారి : రఘు, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఫోన్ 99123 87696

రేషన్ బియ్యానికి రక్షణేది?



గోదాం బయట నిల్వ చేసిన బియ్యం బస్తాలు

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ గోదాం బయట నిల్వ చేసిన రేషన్‌బియ్యానికి రక్షణ కరువైంది. ఇప్పటికే గోదాంలో బియ్యం ఉండటంతో అధికారులు మిగిలిన బస్తాలను ఆరుబయట నిర్లక్ష్యంగా పడేశారు. ఈ బస్తాలు వర్షానికి తడిసే ప్రమాదం ఉంది. మరోవైపు ప్రహరీ లేకపోవడంతో పందులు, ఇతర పశువులు గోదాం ఆవరణలోకి వచ్చి బియ్యాన్ని ధ్వంసం చేసే అవకాశం ఉంది. ఈ బియ్యానికి భద్రత ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు భవనాలేవి?



ఖర్బాలాలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు
- నిర్వహణకు ఇబ్బంది పడుతున్న సిబ్బంది, లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

తానూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందించే ఉద్దేశంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. తానూరు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో అద్దె భవనాల్లోనే కేంద్రాలను నిర్వహిస్తుండటంతో సిబ్బంది, లబ్ధిదారులు(చిన్నారులు, బాలింతలు, గర్భిణులు) ఇబ్బంది పడుతున్నారు. పక్కా భవనాల మంజూరును అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

మండలంలో..

తానూరు మండలంలో మొత్తం 50 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 16 కేంద్రాలకే సొంత భవనాలున్నాయి. మిగతా 34 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

భారంగా నిర్వహణ..

తానూరు మండలంలోని 34 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లేవ్. వాటిల్లో కొన్ని శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల్లో.. మరికొన్ని అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహించే కేంద్రాలకు సకాలంలో ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. దీంతో కేంద్రాల నిర్వహణ భారంగా మారిందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ అద్దె ఇవ్వడంతో కనీస సౌకర్యాల్లేని శిథిలావస్థకు చేరిన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో కేంద్రాలకు వచ్చే సిబ్బంది, లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.



ఉమ్రి(కే)లో పాఠశాల భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మండలంలోని బెంబర, బోరిగాం, బెల్‌తరోడా, తానూరు, భోసి మహలింగి, బామ్ని, హిప్నెల్లితండా, సింగన్‌గాం, దౌలతాబాద్, కోలూరు, ఎల్వత్, మొగ్లి, హిప్నెల్లి, ఎల్వి, బామ్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలున్నాయి. ఉమ్రి(కే), బోరిగాం, ఖర్బాలా గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను కొనసాగిస్తున్నారు.

నూతన భవనాలు మంజూరైనా..

మండలంలోని బోల్సా, ఎల్వి, హంగిర్గా గ్రామాలకు నాలుగేళ్ల కిందట అంగన్‌వాడీ కేంద్రాల కోసం నూతన భవనాలు మంజూరయ్యాయి. బోల్సా గ్రామంలో నూతన భవనం కోసం భూమిపూజ చేసిన అధికారులు, పాలకులు ఇప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. హింగిర్గా, ఎల్వి గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు లేక భవన నిర్మాణాలు చేపట్టలేదని ఐసీడీఎస్ సిబ్బంది పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములు చూపితే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

భారీవాహనాలతో రోడ్డు ఛిద్రం

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- దెబ్బతింటున్న రాచాపూర్–మూటాపూర్ రోడ్డు
- టిప్పర్లలో మట్టి తరలింపే కారణమంటున్న ప్రజలు

లక్ష్మణచాంద: తరచుగా భారీ వాహనాలు(మట్టిటిప్పర్లు) రాకపోకలు సాగిస్తుండటంతో మండలంలోని రాచాపూర్ నుంచి మూటాపూర్ వెళ్లే బీటీ రోడ్డు ఛిద్రమవుతోంది. రెండు కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన ఈ బీటీ రోడ్డు.. నిర్మించిన ఆరు నెలలకే అధ్వానంగా మారుతోంది. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు గుంతలమయంగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. సమస్య ను పరిష్కరించాల్సిన అధికారులే పట్టించుకోవడం లేదని సమీపంలోని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ఆరు నెలల కిందటే రోడ్డు..

లక్ష్మణచాంద నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే మార్గంలో రాచాపూర్ నుంచి మూటాపూర్ గ్రామం వరకు రెండు కిలోమీటర్ల మేర ప్రభుత్వం బీటీ రోడ్డును ఆరు నెలల కిందటే నిర్మించింది. కానీ కొందరు నిబంధనలకు విరుద్ధంగా రాచాపూర్ సమీపంలో గుట్ట తవ్వుతూ ఈ రోడ్డుపై నుంచే జిల్లా కేంద్రానికి టిప్పర్లలో మట్టి తరలిస్తున్నారు. దీంతో ఈ బీటీరోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయమవుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం పదుల సంఖ్యలో భారీ వాహనాల(టిప్పర్లు) ద్వారా మట్టిని తరలిస్తూ రూ.లక్షల ప్రభుత్వ ధనం కొల్లగొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రామస్తులకు ఇబ్బందులు

ఈ మట్టిని తరలించే టిప్పర్లు రాచాపూర్ సమీపంలోని గుట్ట నుంచి మూటాపూర్ గ్రామం మీదుగా నిర్మల్ వెళ్తున్నాయి. దీంతో రాచాపూర్–ముటాపూర్ గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు దెబ్బతింటుంది. భారీ వాహనాలు గ్రామాల గుండా వెళ్లే సమయంలో మూటాపూర్, అక్కాపూర్ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుపై భారీ వాహనాలను నిషేధించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూటాపూర్ సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



రాచాపూర్ సమీపంలో ధ్వంసమైన రోడ్డు



రాచాపూర్-మూటాపూర్ మధ్య రోడ్డు దుస్థితి



రాచాపూర్ సమీపంలో గుట్ట నుంచి వచ్చే మార్గం

ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని లలితా పరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. తగిలపెల్లి నాగజ్యోతి, ఆనంద్ దంపతులు ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడిదెల రాజన్న తదితరులు ఉన్నారు.

ఖానాపూర్ నియోజకవర్గంలో పోలైన ఓట్లు

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలను అధికారులు వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 2,20,526 ఓట్లకు గాను 1,70,815 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఖానాపూర్ మండలంలో 40,281 ఓట్లకు గాను 30,423 మంది తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. కడెం మండలంలో 28,276 ఓట్లకు గాను 22,424 మంది, దస్తురాబాద్ మండలంలో 12,705 ఓట్లకు గాను 10,333 మంది, ఇంద్రవెల్లిలో 30,893 ఓట్లకు గాను 24,801 మంది, జన్నారంలో 43,232 ఓట్లకు గాను 32,462 మంది, పెంబి మండలంలో 10,528 ఓట్లకు గాను 8,317 మంది, ఉట్నూర్ మండలంలో 48,866 ఓట్లకు గాను 36,970 మంది తమ ఓటు వేశారు.




ఖానాపూర్ మండలం ఎర్వచింతల్‌లో ఓటు వేస్తున్న ఓటర్లు

సిరికొండ మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో 5745 మంది ఓటర్లు ఉండగా 5085 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

వందశాతం పోలింగ్ నమోదు

- ఆదర్శంగా నిలిచిన బావుజిపేట్ గ్రామం

ఇచ్చోడ: ఇచ్చోడ మండలంలోని బావుజిపేట్ మారుమూల గిరిజన గ్రామం. కనీస సౌకర్యాలు కూడా లేవు. కానీ గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు వంద శాతం ఓట్లేసి ఆదర్శంగా నిలిచారు. సిరిచెల్మ నుంచి దాదాపుగా 7 కిలోమీటర్లు గ్రామస్తులు కాలినడకన నడిస్తే కానీ గ్రామానికి చేరుకోలేరు. అత్యవసర సమయంలో ఎడ్లబండి తప్పా ఆటో కూడా వెళ్లలేని పరిస్థితి. కానీ అక్కడి ప్రజలు నియోజకవర్గంలోనే ఆదర్శంగా నిలిచారు.



రోడ్డు సౌకర్యం లేక నడిచి వెళ్తున్న ప్రజలు

బావుజిపేట్‌లో పురుషులు 170, మహిళలు 200 ఓట్లు మొత్తం 370 ఓట్లు ఉన్నాయి. గురువారం జరిగిన ఎన్నికలలో 370 ఓట్లు వేయడంతో వంద శాతం పోలింగ్ నమోదైంది.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా



మాట్లాడుతున్న ఎంపీడీవో తిరుమల

ఉట్నూర్‌రూరల్: డిసెంబర్ 1న శుక్రవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో తిరుమల శుక్రవారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులకు డిసెంబర్ 1న ప్రత్యేక సెలవు ప్రకటించడం వల్ల మండలస్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేక పోవడంతో వాయిదా వేశామన్నారు. తదుపరి సమావేశ నిర్వహణ తేదీని ప్రకటిస్తామన్నారు.